


# వల

'పైడిపాల'

'కమ్యూనికేషన్స్' తలుపు తెరిచిన సీతారాం చేతిని మృదువుగా నొక్కాడు మధు.

''అరే – ఇప్పుడే లేవడమా? రాత్రి పెళ్ళికూతురు కల్లోకొచ్చి అల్లరి చేసిందేమిట్రా?''

''ఛ! ఛ! అదేం కాదు.''

''ఛ! ఛ యా? – ఓరి బడుద్దాయ్, అందమైన కలలు రావడం కూడా నేరమే?''

''అదికాదురా – నువ్వు రాత్రే వస్తున్నట్టు రాశావు కదా–నీ కోసం ఎదురు చూసి చూసి...''

''నిజం చెప్పనా? – నేను రాత్రే వచ్చాను.''

''మరి నేను పలకలేదా?''

''లేదురా. నేనసలు నీ రూంకే రాలేదు. స్టాండ్‌లో బస్ దిగేవరికి పదయింది. నీ రూంకి వద్దామనుకుంటుండగా ఓ చిన్న కేస్ తగిలింది అమలాపురం వెళ్ళాలంట. వేషం, భాష – చూస్తే ఎవరూ అక్షరాలు రావనుకోరు. అలా పొరపడే కండక్టరు కూడా బస్సెక్కించుకొని వుంటాడు. తీరా టిక్కెట్టు తీసుకొనేటప్పుడు ఆమె ఎక్కాల్సిన బస్ అదికాదని తేలిపోయింది. ఈ వూళ్ళో దిగితే అసలు బస్ దొరుకుతుందని చెప్పి ఇక్కడ దింపేసి వెళ్ళిపోయాడు కండక్టరు. ఇక్కడ దిగిన తర్వాత కూడా ఒకటి రెండు బస్‌లు వెళ్ళిపోయాయట. అవి తనెక్కాల్సిన బస్సో కాదో అడగడానికి నామోషి. అలాంటి పరిస్థితిలో ఆపద్బాంధవుడిలా నేను తగిలాను. ఒంటరిగా వుందని పలకరించాను. మొదట్లో జాలిపడి నిజంగానే బస్సెక్కించి పంపించేద్దామనుకున్నాను. కాని అప్పటికే లాస్ట్ బస్ వెళ్ళిపోయింది. కబుర్లలో ఆమె గంగిగోవని పసికట్టేశాను. మొదట్లో కొంచెం మొరాయించినా ఆ తర్వాత మెత్తబడిపోయింది. రాత్రంతా సత్రంలో ఆనందంగా గడిపి పొద్దుటే దాన్ని బస్సెక్కించి వస్తున్నా.''

''నీ కథలు నేను నమ్మను. బస్‌స్టాండులోను, సినిమాహాలులోను, హాస్పటల్‌లోనూ–ఎక్కడబడితే అక్కడ పిట్టల్ని పట్టెయ్యడానికి నీ దగ్గరేమయినా మంత్రముందా? అంత తేలిగ్గా లొంగిపోతారంటే ఆడజాతిమీదే నాకు అనుమానం వస్తోంది.''

''ఇంగ్లీషులో ఓ సామెతుంది. పాతివ్రత్యం అవకాశం రానంతవరకేనని. అలా అని ఆడవాళ్ళంతా ఈ బాపతేనని నేననను. కాని ఇందులో ఓ చిన్న రహస్యముంది. నేను మిధునరాశిలో పుట్టాను. మెత్తబడే గుణం వున్న ఆడవాళ్ళు నాలాంటివాడికి ఇట్టే లొంగిపోతారు. నేను గట్టిగా రెండు నిముషాలు మొహంవంక పరకాయించి చూసి అది పిట్టో కాదో చెప్పెయ్యగలను కూడా.''

''ఈ సొరకాయకోతలు నాదగ్గర చాన్నాళ్ళుగా కోస్తున్నావ్. నేను చూస్తుండగా ఓ కేస్ పట్టి అప్పుడు నీ శక్తి గురించి చెప్పు.''

''ఎంత బెట్?''

''వంద రూపాయలు.''

'సరే! పందెం ఖాయం. నేనెలాగూ నాల్రోజులు సెలవు పెట్టి వచ్చాను. నే వెళ్ళేలోగా నా తడాఖా చూద్దువుగాని''

''చూద్దాంలే – పెళ్ళయి పిల్లలు పుట్టినా నీకీ బుద్ధి పోలేదేమిట్రా?''

''ఏడిసినట్టుంది? — పెళ్ళయితే వేట లైసెన్సు పోతుందేవిటి? — ఆ మాటకొస్తే పెళ్ళవకుండా నువ్వేం ఉద్ధరించావట? బై దిబై నీ వుడ్‌బి ఎలా వుంటుంది? నీ దగ్గిర అమ్మాయి ఫోటో ఏదైనా.. ?''

''లేదు నేనసలు అమ్మాయినే చూళ్ళేదు. మా వాళ్ళకి నచ్చింది. ఖాయం చేసేశారు''

''భేష్. ఇరవయ్యో శతాబ్దంలో కూడా అమ్మాయిని చూడకుండా పెళ్ళి చేసుకుంటున్నావంటే నీకో సన్మానం ఏర్పాటు చెయ్యాల్సిందే. 'రాముడు మంచి పిల్లవాడు' మార్కు మనిషివి. పోనీ, పేరైనా కనుక్కున్నావా?''

''జానకి మైలు గాలితో రూంలో అడుగు పెట్టావ్! ముందు మొహం, స్నానం కానియ్'' ఆ టాపిక్ నుంచి డైవర్ట్ చెయ్యాలని సీతారాం ప్రయత్నం.

''అవున్రా అమ్మమ్మని చూడ్డానికి వెళ్ళాలి ఆవిడింకా బతికుందో లేదో'' మధు 'బ్రీఫ్' తెరిచి బ్రష్, పేస్ట్ తీసుకొని బాత్‌రూంకేసి నడిచాడు.

సీతారాం, మధు హైస్కూల్లో క్లాస్‌మేట్స్. అప్పట్నుంచి మంచి స్నేహితులు సీతారాం పల్లెటూరు, పట్నవాసం కాని ఆ వూళ్ళో బ్యాంక్ ఉద్యోగం వెలిగిస్తున్న బ్రహ్మచారి మధు అమ్మమ్మ గారి ఊరు పక్కనే మైలు దూరంలో వున్న పల్లెటూరు అతగాడు అక్కడికి నలభై మైళ్ళ దూరంలోవున్న పట్నంలో నాలుగంకెల జీతం వచ్చే ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ముసలమ్మకి వంట్లోబావుండకపోతే చూడ్డానికని వచ్చాడు మధు.

* * *

ఆకాశం కనకాంబరం రంగు చీరలో సిగ్గు లొలక బోస్తున్న చిన్నదిలా వుంది.

బస్‌స్టాండ్ అందమైన పూలతోటలా వుంది.

స్టాండ్‌లో ఓ మూల మధు, సీతారాం నిల్చున్నారు చల్లని 'పిల్ల' గాలిని నాస్వాదిస్తూ మధు కబుర్లు చెబుతూనే వున్నాడు. అతని కళ్ళు తుమ్మెదల్లా పరిభ్రమిస్తున్నాయి.

''ఇవాళ మూడోరోజు. పందెం పేరు చెప్పి నాకెంతా పాడు చేస్తున్నావు. అంతేకాదు నేనిలా వరసగా బస్‌స్టాండ్‌లో బీట్ కాయడం చూస్తే తెలిసిన వాళ్ళు అపార్థం చేసుకొనే అవకాశం వుంది కూడాను''

''మైడియర్ సీతారాం. నిన్ను చూస్తే జాలేస్తుంది నీలాంటి వాళ్ళు సమాజం కోసం బ్రతికే మనుషులు. పై వాళ్ళేదో అనుకుంటారని నీక్కావాల్సింది తినడం మానేస్తావా? — ఇదీ అలాంటిదే. నీలాంటి వాడే మాకో లెక్చరర్ ఫ్రెండ్ వున్నాడు. అన్నీ అనుభవించాలనే సరదా లోపలుంది— కానీ పైకి భయం. అఫ్‌కోర్స్ — అతని ఉద్యోగం కూడా అలాంటిదే అనుకో. ఓ సారేం జరిగిందో తెల్సా?''

''ఏమయ్యింది?'' కుతూహలంగా ప్రశ్నించాడు సీతారాం.

''చూశావా — ఎంత ఇంటరెస్టు చూపిస్తున్నావో. అతనూ ఇలాగే అన్నీ అడిగేవాడు. ఓ రాత్రి మా ఫ్రెండ్సంతా కేబరే చూడ్డానికని కేసి బయలుదేరుతుండగా అతను బ్రతిమాలించుకొని వచ్చాడు కళ్ళకు చేతులడ్డం పెట్టుకొని 'కేబరే' అంతా దివ్యంగా చూశాడు కాని మాటిమాటికి 'రామ... రామ ... బొత్తిగా సిగ్గు లేకుండా...' అంటూ నీతి పురాణం ప్రారంభించి మమ్మల్ని మాత్రం చూడనివ్వకుండా చంపేశాడు. అలాగే—నీకూ మనస్సులో కోరిక వున్నా పైకి బుద్ధిమంతుడని పించుకోవాలని ఏవ....''

''లేకపోతే నీలా బరి తెగించి బజార్న పడమంటావా? పందెం వద్దూ, పాడూ వద్దూ. రా — వెళ్ళిపోదాం''

''అమ్మమ్మ. నువ్వు వద్దన్నంత మాత్రాన పందరూపాయల్నంత తేలిగ్గా వదిలేసుకుంటావా? అవును — ఆ అమ్మాయిని చూశావా? అరగంట నుంచి అలాగే షెల్టరులో నిల్చొని వుంది. ఏ బస్సొచ్చినా ఎక్కడం లేదు'' కనుసైగ చేసి చూపించాడు మధు అటు చూశాడు సీతారాం.

తెల్లని పాలిస్టర్ చీర... మెళ్ళో ముత్యాల లాకెట్...తల్లో మల్లెపూల చెండు...పసిమిఛాయ... ఆ సాయంత్రం చిరుజల్లులో తడిసి వచ్చిన పావురంలా వుంది. వయసు పొంగులకు పుస్తకాలు అడ్డెట్టుకొని నిల్చున్న ఆ వయ్యారిని చూడగానే సీతారాం మనస్సు జివ్వుమంది.

''చాలా బావుంది ఆ అమ్మాయి...'' అర్ధోక్తిలో ఆగాడు సీతారాం.

''ప్రయత్నిస్తే వల్లో పడేలావుంది'' మధు పెదవులపై చిరునవ్వు లాస్యం చేసింది.

''ఇంపాజిబుల్. కాలేజి స్టూడెంటులా వుంది''

''బావుంది. నా పందెం ఇలాంటి ఫిగర్‌ని పడతాననే కదా! బజారు వాళ్ళయితే పందెం ఎందుకు...?''

''అయితే మరి రంగ ప్రవేశం చెయ్యి''

''కంగారు పడకు. దానికీ సమయం, సందర్భం వుంది. ఆ అమ్మాయిని చూడు. మనకేసి క్రీగంట చూస్తోంది. మనం తనని చూస్తున్నామని పసికట్టి మరీ వయ్యారాలు పోతోంది బండి లైనులో కొస్తోందన్న మాట''

సీతారాం ఆ అమ్మాయి కళ్ళమీద కవిత్వం చెవుతున్నాడు. ఆ కొత్త బిచ్చగాడి ఆవేశాన్ని గమనించి మధు ఆటలు పట్టిస్తున్నాడు. బస్‌స్టాండ్‌లో నియాన్ లైట్ల వెలుతురు వెన్నెల్లా పరుచుకొంది.

వాచీ చూశాడు మధు. ఏనిమిదయింది. ఆ అమ్మాయి అక్కడనుంచి కదల్లేదు వచ్చి గంటన్నర దాటింది. వచ్చిన బస్‌నల్లా పరిశీలనగా చూస్తోంది తప్ప, ఏ బస్ దగ్గరికీ వెళ్ళడం లేదు.

''రాం, నువ్విక్కడే వుండు. నే వెళ్ళి కదిలిస్తాను.'' మధు నిర్భయంగా ఆ అమ్మాయి దగ్గరకెళ్ళాడు.

అంతవరకు ఆ అమ్మాయితో మాట్లాడుతున్న బామ్మగారు బస్సెక్కడంతో మధుకి ఆమెని పలకరించడానికి వీలుచిక్కింది. కాని అతణ్ణి చూడగానే ఆ అమ్మాయి తల తిప్పేసుకొంది.


''ఏవండీ. మీరెక్కడికెళ్ళాలి'' మర్యాదగానే అడిగాడు. ఆమె పట్టించుకోలేదు.

''మిమ్మల్నేనండీ'' రెట్టించాడు.

''మీకిదే వుద్యోగమా?'' మాట కటువుగా వున్నా, గొంతు మధురంగా వుంది.

''అహ... అపార్థం చేసుకోకండి. ఒంటరిగా వున్నట్టున్నారు... చీకటి పడిపోయింది. మీకు తెలుసో తెలియదో — ఈ వూరంత మంచిది కాదు. అంచేత మీ మేలు కోరి..''

''సారీ... మా బ్రదర్ బస్సులో రావాలి.



అతని కోసం ఎదురు చూస్తున్నాను. సినిమా టైమ్‌కి వచ్చేస్తానన్నాడు.''

''అరరే... మరి టైం దాటిపోయింది కదూ — మీరింటికి వెళ్ళిపోకపోయారా ?''

''మాది రామాపురం. నేను కరణంగారమ్మాయిని. బస్ దిగి మైలు దూరం నడవాలండీ. ఒంటరిగా వెళ్ళాలంటే భయం. అందేత ఏం చెయ్యాలో తెలియక ఇలా నిల్చుండిపోయాను.''

''మీ అన్నెవరోగాని — అతగాడిమీద నాకు మహా కోపమొస్తోందండి. అపాయింట్‌మెంట్ యిచ్చిన తర్వాత ఆ మాత్రం బాధ్యత వుండొద్దండీ? పోనీ నన్ను తోడుగా వచ్చి డ్రాప్ చెయ్యమన్నారా ?''

''అమ్మో! — మావాళ్ళు కోప్పడతారు ''

''పోనీ — ఈ వూళ్ళో తెలిసిన గర్ల్ స్టూడెంట్స్ ఎవరూ లేరా ?''

''ఉన్నారనుకోండి. అర్ధరాత్రి వాళ్ళిళ్ళకు వెళ్ళడం ఏం బావుంటుంది ?''

''మరి మీరింటికి వెళ్ళకపోతే ఏం అనరా?''

''తప్పు నాది కాదు కదా- ఏదో సర్ది చెపుతాను'' ఆ అమ్మాయి మొహంలో ఆందోళన ద్యోతకమౌతోంది.

''అయితే, మీ కభ్యంతరం లేకపోతే మా చుట్టాల ఇళ్ళొకటి ఖాళీగా వుంది. రాత్రికి మీరు నిర్భయంగా అక్కడుండొచ్చు''

''అమ్మో! నాకు భయం''

''చూడండి. మీరు నన్ననుమానిస్తున్నట్టున్నారు. నేనేం రోడ్‌సైడ్ రోమియోని కాదు — కాలేజి కుర్రాణ్ని కాదు. లక్షణంగా ఆఫీసరు ఉద్యోగం చేస్తున్న వాణ్ని. ఏదో మీ స్థితి చూసి జాలిపడి ... బైది బై మీ పేరు...''

''సుజాత''

''ఏం చదువుతున్నారు '

''ఇంటర్''

''మీకు తెలుగుకి శాస్త్రిగారొస్తారా ? — అదే సన్నగా, ఎర్రగా, పొడవుగా...''

''ఆ... ఆ...''

''అతను నాకు బెస్ట్‌ఫ్రెండ్. కొద్దిలో తప్పిపోయింది గాని నేను కూడా లెక్చరర్ కావాల్సిన వాణ్నే''

''మీ కంత వయసున్నట్టు కనిపించటం లేదు. కాలేజి స్టూడెంటను కున్నాను.''

''ఎంప్లాయ్‌నయినంత మాత్రాన తాతగారనుకుంటున్నారా, ఆ మాటకొస్తే నేనింకా ఒంటరిగాణ్నే''

''మీరు భలే గమ్మత్తుగా మాట్లాడతారే ?''

''మీరు మాత్రం — మాటలోనూ, చూపులోనూ మత్తే''

మధు సుజాత అందాన్ని పొగడుతున్నాడు... మాటలు పరిహద్దులన్నీ చెరుపుతున్నాయి. కాలం కళ్ళు కప్పుతున్నాయి.

అవతల ఒంటరిగా నిల్చున్న సీతారాంకి బోరు కొడుతోంది మధు చాకచక్యానికి సీతారాం ఆశ్చర్యపోతున్నాడు — అతని అదృష్టానికి అసూయ పడుతున్నాడు. మరో అరగంట గడిచిన తర్వాత మధు సుజాతని తీసుకొచ్చి సీతారాంకి పరిచయం చేశాడు.

వాళ్ళు రెండు రిక్షాల్లో మధుకి పరిచయం వున్న సత్రం చేరారు. మధుని చూడగానే అక్కడున్న నౌకరు ధర్మన్న నమస్కారం చేసి తలుపులు తెరిచాడు.

''మా వాళ్ళు తిరుపతి వెళ్తూ ఇల్లు నాకప్పగించి వెళ్ళారు. ఇతను వాళ్ళ నౌకరు'' అని చెప్పి, మధు సుజాతను ఇంట్లోకి తీసుకెళ్ళాడు. లోపల మంచాలు, ఫ్యాను.. అన్ని సౌకర్యాలూ వున్నాయి. మధు ధర్మన్నని మీల్స్ కేరియర్ తెమ్మని పురమాయించాడు.

''మీకు శ్రమ కలిగిస్తున్నాను'' సుజాత నొచ్చుకొంది.

''అందమైన వాళ్ళకోసం శ్రమ పడ్డంలో ఆనందముంది'' మధు చిలిపిగా నవ్వాడు.

సీతారాం ఆమె సొగసుని చూసి వివశుడైపోతున్నాడు. మధు, సుజాత చిరపరిచితుల్లా నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుకోవడం అతనికి దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఏం మాట్లాడాలో తెలియక వాళ్ళ సంభాషణలో పాలు పంచుకోలేక పోతున్నాడు.

ఇంతలో ధర్మన్న కేరియర్ తీసుకొచ్చాడు. సుజాత చనువుగా కేరియర్ విప్పి ముగ్గురికీ వడ్డించింది. సీతారాం బిడియ పడుతున్నాడు.

''మీ చెయ్యి తగలడంవల్ల హోటలు భోజనాన్ని కూడా హాయిగా తింటున్నా. ఇలాగే జీవితం సాగునా...''

''పాపం — ఆశ'' సుజాత కళ్ళు వేపపిల్లల్లా మెరిశాయి.

భోజనాలయిన తరువాత కూడా మధు సుజాతల కబుర్లు తెమలడంలేదు. సీతారాంకి సిగ్గు, భయం — ఆపైన నిద్ర ముంచుకొస్తున్నాయి.

''మావాడికి నిద్రొస్తున్నట్టుంది. జాగ్రత్తగా తలుపులు వేసుకొని పడుకోండి. ఏం భయంలేదు.''

''అమ్మో! నేనొక్కదాన్నే...'' కళ్ళు పెద్దవి చేసింది.

''మరి జంటగా పడుకుందామంటారా ?'' కన్నుగొట్టాడు.

''ఛీ! పాడు'' ఆమె సిగ్గుల భరిణయింది.

''జంట పాటలు నాకు రావండీ'' మధు నవ్వుతూ సీతారాంని బయటికి తీసుకెళ్ళి చెవిలో గుసగుసలాడాడు.

మధు లోపలకు వెళ్ళాడు.. తలుపులు మూసుకున్నాయి.

గాజుల గలగలలు...నవ్వుల కిలకిలలు...మధురమైన నిట్టూర్పులు...

సీతారాం మెదడులో హోరు... ఆలోచనల జోరు... ఆడజాతిమీద అనుమానం... అసహ్యం...

'కొన్ని గంటల్లో కన్నెపిల్లని మాయమాటల్తో మచ్చిక చేసేసుకున్నాడు మధు... పైగా కాలేజీ పిల్ల... అది మాత్రం ఎంత ధైర్యంగా వాడితో వచ్చేసింది. అది ధైర్యం కాదు...అమాయకత్వం... ఆమె అందం అతని పతనానికి హారతైపోతోంది. అయితే తనకు కాబోయే భార్య జానకి కూడా... ?'

ఆలోచనలు అనుమానాలు కలగాపులగంగా అతణ్ని కలవరపెడుతున్నాయి. యాంత్రికంగా అతను రోడ్డెక్కాడు... !

* * *

ఆ వుదయం మధు విజయ గర్వంతో సీతారాంని తట్టి లేపాడు.

''రాం... నువ్వు నిజంగా నాకు చాలా హెల్ప్ చేశావ్. నీ వల్లే నాకంత స్వీట్‌కేక్ దొరికింది. అచ్చమైన అనాఘ్రాత పుష్పం. పాపం అమాయకురాలు... నేను నిజంగా పెళ్ళి చేసుకుంటానని నమ్మి మోసపోయింది. మళ్ళీ ఈ రాత్రి కూడా వస్తానంది తెలుసా ?...'' మధు ఆనందంగా ఈల వేస్తున్నాడు. ట్విస్టు చేస్తున్నాడు.

''ఛ! ఛ! వందరూపాయలు పోయినందుకు కాదు .. నా కళ్ళ ముందే ఓ కన్నెపిల్ల బ్రతుకు నలిగిపోయింది'' సీతారాం సుజాత మీద జాలి పడుతున్నాడు.

సరిగ్గా అదే సమయంలో —

''పాపం — పిట్టల వేటగాడు! నేను నిజంగా కాలేజీ అమ్మాయినని నమ్మి మోసపోయాడు. మామూలు బేరమయితే పదోపరకో ముట్టేది అలాంటిది ఒక్కరాత్రికి బంగారపు ఉంగరం ఇచ్చేశాడు అమాయకుడు. ప్రేమ గుర్తట! ఈ రకం ప్రేమే బావుంది'' అనుకుంది అప్పుడే ఇల్లు చేరిన వేశ్య నాగమణి ఉరఫ్ సుజాత!

[సోదరుడు శ్రీ పి. రామారెడ్డి, మెకప్స్ నేవేజర్, మిత్రుడు ఎమ్. గంగిరెడ్డిగార్లకు కృతజ్ఞతతో...] ●

త్వరలో

కొత్త సీరియల్!

జీవిత గమ్యం

రచన : యద్దనపూడి... యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

ప్రారంభం!